# యువగర్జనకు ఐదు వేల బస్సులు

- గుంటూరు, విజయవాడ నుంచి 700
- వేల సంఖ్యలో కార్లు, టెంపోలు
- పూలు చల్లేందుకు రెండు హెలికాప్టర్లు
- పౌరుషాన్ని చాటేలా వేదిక అలంకరణ

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** యువగర్జన ద్వారా పార్టీ సత్తా చాటాలని భావిస్తున్న తెలుగుదేశం అందుకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించేందుకు సమాయత్తమవుతోంది. ఐదో తేదీన గుంటూరులో జరిగే భారీ సభ కోసం దాదాపు ఐదు వేలకు పైగా బస్సులను బుక్ చేసినట్లు సమాచారం. ఇందులో సగంపైగా ఆర్టీసీ బస్సులున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ప్రైవేటు బస్సులు, ట్రావెల్స్ బస్సులను పెద్ద సంఖ్యలో అద్దెకు తీసుకున్నట్లు చెబుతున్నారు. గుంటూరు, విజయవాడ నుంచి వచ్చే ప్రజల కోసం 700 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి అభిమానులను సభాస్థలికి తరలించేందుకు ఆ రోజు బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. ఇక్కడి రైల్వే స్టేషన్లలో కూడా 100 చొప్పున బస్సులు సిద్ధం చేశారు. చాలాచోట్ల తెదేపా కార్యకర్తలు, నందమూరి అభిమాన సంఘాలు నేతలు సొంతంగా వాహనాలను సమకూర్చుకోవటంతో వేల సంఖ్యలో కార్లు, టెంపోలు గర్జనబాట పట్టనున్నాయి. ఇప్పటికే 22 రైళ్లను కూడా యువగర్జన కోసం అద్దెకు తీసుకున్నారు. దక్షిణమధ్య రైల్వేనుంచి 20 రైళ్లు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే నుంచి మరో రెండు రైళ్లను తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**హెలికాప్టర్లతో పూలవర్షం:** యువగర్జన ప్రాంగణంపై పూలవాన కురిపించేందుకు రెండు ప్రత్యేక హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. పూలు, పార్టీ పతాకాలు, స్టిక్కర్లను ఆకాశం నుంచి చల్లుతారు. యువగర్జనసభ రోజు ఉదయం హైదరాబాద్‌నుంచి గన్నవరం విమానాశ్రయానికి రెండు కింగ్ ఫిషర్ విమానాలు వస్తున్నట్లు సమాచారం. పార్టీ నేతల కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు, బాలకృష్ణ, సీనియర్ నాయకులంతా ప్రత్యేక విమానంలో యువగర్జనకు హాజరవుతారు.

**వేదికపై సింహం ప్రతిమలు:** యువగర్జన వేదికపై నందమూరి పౌరుషాన్ని ప్రతిబింబించేలా అలంకరిస్తున్నారు. వేదికకు ఇరువైపులా రెండు సింహం ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. పల్నాటి పౌరుషాన్ని చాటేలా చెక్కతో చేసిన గిత్త కొమ్ములను కూడా ఏర్పాటు చేసినట్లు వేదిక అలంకరణ కమిటీ కన్వీనర్లు అల్లాడి రాజ్‌కుమార్, మాగంటి గోపీనాథ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. యువశక్తికి చిహ్నంగా పెద్ద కాగడాలు కూడా ఉంటాయని చెప్పారు. మరోవైపు యువగర్జన ఏర్పాట్లపై చంద్రబాబు ఆదివారమిక్కడ అన్ని జిల్లాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అభిమానులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



గుంటూరులో రూపుదిద్దుకుంటున్న యువగర్జన ప్రాంగణం

**గుంటూరు:** యువగర్జన ప్రారంభం సందర్భంగా ఎన్టీఆర్ ప్రాంగణంలో 30 నుంచి 45 నిమిషాలపాటు భారీఎత్తున బాణసంచా పేల్చనున్నట్లు యనమల చెప్పారు. పసుపురంగు మాత్రమే వెలువడటం ద్వారా ప్రాంగణమంతా పసుపుమయం అవుతుందన్నారు. ఇందుకు తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి ప్రత్యేకంగా బాణసంచా తెప్పిస్తున్నామన్నారు. చీకటి పడేసరికి ప్రాంగణమంతా పసుపు రంగులో సీరియల్ లైట్లు వెలుగుతాయన్నారు.

**5న పొలిట్‌బ్యూరో భేటీ:** యువతకు సంబంధించి తెలుగుదేశం పార్టీ భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలు, విధివిధానాల గురించి చర్చించడానికి యువగర్జన ప్రారంభానికి ముందు పొలిట్‌బ్యూరో సమావేశం జరుగుతుందని యనమల చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రబాబు, బాలకృష్ణ తదితరులు తాత్కాలికంగా విడిదిచేయబోయే గృహంలోనే ఈ సమావేశం ఉంటుందన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రస్తుత యువత కమిటీ కన్వీనరు వేమా నరేందర్‌రెడ్డితో పాటు తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, ప్రత్యేక ఆహ్వానితునిగా నందమూరి బాలకృష్ణ హాజరయ్యే అవకాశం ఉందన్నారు.